

విరిగిన విగ్రహం

'అనిల్'

F3099

آع

విరిగిన విగ్రహం

కథ

F3099.

LIBBIOLIB190

విరిగిన విగ్రహం


మరాఠీ మూలము :

ఆ. రా. దేశపాండే 'అనిల్'

(విరచిత 'భగ్నమూర్తి')

అనువాదం :

కోట సుందరరామ శర్మ



సాహిత్య అకాదెమీ

న్యూ ఢిల్లీ

VIRIGINA VIGRAHAM—Telugu translation of the Marathi Poem 'Bhagnamurti' by A. R. Deshpande 'Anil'. Translated from the original by Kota Sundararama Sarma.
Sahitya Akademi, New Delhi, 1964
Price Rs. 2-50.

© సాహిత్య అకాదెమీ, న్యూ ఢిల్లీ

ప్రథమ ముద్రణ, 1964


సోల్ డిస్ట్రిబ్యూటర్స్:
వేంకట్రామ & కంపెనీ
విజయవాడ

Also available at :
Sahitya Akademi,
Rabindra Bhavan, New Delhi-1
38/B, Mount Road, Madras - 6.

ముద్రణ:
హిందీ ప్రచార ప్రెస్
టి. నగర్, మద్రాసు - 17

వెల: రు. 2-50

Cover Illustration : Courtesy : Original Marathi edition publish
by Sindhu Prakashan, Khandwa & Nagpur.



విరిగిన ఒక విగ్రహమును
దాని కెదురుగానే ఒక
శిథిలమయిన దేవళమును;
మిగిలిన వా నాలుగే
రాతిస్తంభా లక్కడ—
గతవైభవసాక్షులుగా!

భవ్యమైన ప్రాకారము
ఉన్నతమౌ గోపురమ్ము
బంగారపు కలశము—ఇవి
లేనేలే వేమి, మరి.
పడి, పాడయి, ధ్వంసమై
కాలప్రవాహములో పడి
కొట్టుకుపోయినవి—ఇంత
జాడకూడ మిగులకుండ.

నేటికి ఈ కనపడే
నాలుగు స్తంభాలుకూడ
అటూ ఇటూ పడిఉన్నవి.

వాని జీర్ణ శేషాలను
వెదకిపట్టి, వానిమీద
స్తంభాలను, నాడుండే
విధంగా అమర్చి కూర్చి
ఏలాగో కప్పుతీర్చి
పెట్టగలిగితిని శ్రమించి.

పద, కొంచెము దగ్గరగా
పరికించుము సూక్ష్మముగా
ఒక్కొక ఈ రాతికంబ
మొక్కొక నీ కళాస్మృతి!
—కాని, కళాస్మారకమని
ఏలా అనగలుగుదుము?
నీ ఇట్టి అనాస్థ చూచి
కలతచెంది మదిలో, "నీ

కళ కిది జీవత్సమాధి"
అని అంచే తప్పేమిటి?

పనితన మొలికించిన ఈ
రాతిపైన, అయ్యయ్యో,
చవుడూరెను, పాచిపట్టె!
అదిగో, అది ఏమిటి మరి!!
సరదాగా తిరగడమో,
వనభోజనమో, దేవుని
దర్శనమో, ఏ పనో
పెట్టుకు వచ్చిన పెద్దలు
తమ పేర్లను చెక్కిపెట్టు
కొన్నారో, ధన్యులయా!
శాశ్వతమై నిలిచినవో
పేర్లు, కళావిధ్వంసుల
వానృశంసులవి ఇలలో!
కోణాలను చెక్కివైచి
విధ్వంసకజనము కొంద
రంటూ "ఠీ ఎర్రరాతి

చూర్ణముతో రుద్దినచో
వెండీబంగారాలకు
మెరుగెంతో వస్తుం " దని !
" ఎంతో ఉపయోగ " మనీ.

శిథిలా లివి శేషించిన
అట్టి మహాసంస్కృతికీ,
అట్టి కళాసంపదకూ
నీవేనా, వారసుడవు ?
తన గారడి చేతులతో
గరగరైన రాతిపైన
అందమయిన ఆకృతులను
చెక్కిన అజ్ఞాతశిల్పి
నీ పూర్వికుడే కాదా ?

ఎంతనేర్పు ! కంబముపై
చెక్కిన ఈ కమలబంధ !
మొక్కొక కోమలదళమే
మలచగా సహస్రదళము

నిలిచెనహో, వికాసించి!
రేకులు గుంఫించినాడు
నాజూకుగ నలుప్రక్కల
ఎన్నెన్నో ఆకృతులుగ
కమలాలను అందముగా
చిత్రించిన శిల్పిరాజు
భావనావికాస మహిమ!
ఏనుగు దంతముగానో
సిస్సుకర్రగానో ఆ
రాతిని భావించెబోలు!
అవిజ్ఞాతశిల్పి చెక్కు-
కోలేదు స్వనామ మచట
కానీ, మనమనసులో
కల్పనా జగత్తులో
నిలుచునతని ఆకారము!

ఇచటెచటో చెట్టుక్రింద
కూర్చుని ఎంతో శ్రమించి
రాతినిట్లు మలచినాడు,

పూర్ణమైన స్వరూపమును
శిల్పి మదిని కల్పించుక.
సుతిమెత్తని ఉలిదెబ్బల
కొస కిడుచు, సురమ్యకళా -
కృతిపూరితి గావించెను
ఇటులెన్నో నెలలు గడపి!

ఇది కొంచెపు భాగమె, ఆ -
తడు రూపించిన దేవళ
మంతటిలో ; ఇంక నెన్నో
ఆకృతులను చెక్కియుండు
మంటపమున—హ్రస్వబాహు -
కుల, కిన్నర గంధర్వుల
రూపావళి సృష్టిచేసి.
ఈ రమ్యస్థలి నొనర్చె
కళాపూర్ణ శిల్పసృష్టి
భవ్యదేవకులము కట్టి,
లో సురమ్య విగ్రహమును
స్వకళాపరమావధిగా

స్థాపించెను మహాశిల్పి !
శివ, శివ ! చూడాయెదుటను
ఛిన్నభిన్నఖండితముగ
పడియు న్నా విగ్రహమును
అడ్డులేని వర్షాతప
ములకు ; నీ ఉపేక్షచేత
ఖండితమగు చింకెంతో !!

అయ్యో, అజ్ఞాతశిల్పి
ఎడతెంపులు లేక తాను
అహోరాత్రములను గడపి
నీ ఉజ్జ్వల సంస్కృతి కిడె
ఆభరణము వెలలేనిది.
ఇచటెచటయినను ఆతని
అస్థికలవి మిగిలియున్న,
భస్మకణము అంబాలయ*
జలములలో దాగియున్న,
బలువెతచే సురిగిపోవు

* రామగిరి యొద్దనున్న చెరువు పేరు.

నిపుడీవిధి గనుపించెడి
తనశిల్పము ధ్వంస్తానికి !!

సంస్కృతికి అమూల్యదాన
మిచ్చె, ముందుతరము దాచు
కొను భద్రముగా ననుకొని.
ఆతని ఆ దానము ఋణ
మని భావించుచు, ప్రేరే
పణ ఆతనివలన పొంది
ఋణము తీర్చుచేతగు; మరి
దురదృష్టము! ఏమి మిగిలె
ఆతనికిని, మరిమీకును ?
నడిమితరము భద్రపరచు
కోలే దాసంపత్తిని;
వారి కాలమందే అది
విధ్వస్తముకాగా, ఇపు
డింకేమిటి చేయడము ?
తీసినారుగ దివాలా,
ఋణము తీర్పుమా చేలా ?

" దీనికితో డవమానము
పరచకండి, బాబు, నన్ను "
అని ఆ అజ్ఞాతశిల్పి
వేడుకొనే దింతే ఇక !

అత్తమిల్లి పోయెనెపుడో
భాగ్యవిధాకరుడు పళ్ళి
మాళ్ధిలోన మునకవేసి ;
కాని, చిందె తేజోజల
కణములపుడు, నేటికినవె
తారలుగా. ఆకసమున
విభాసించు ; వానిలోని
ఇంచుక తేజమ్ము పొదివి
కొని, యీ భగ్నావశేష
రూపముగా భరతభువిని
పడియున్నవి అచట నచట.
వానిని కాపాడుకోండి :
వాని మసక వెలుగులలో
చింతనచేయండి ; ఉష :

కాల మవతరించుటకొక
యింతవేళ కల దింకను ;
మరి ఇపుడే రామగిరిని
సూర్యు డస్తమింపబోవు ;
దేవ, సూర్యనారాయణ,
సర్వదర్శి, జగచ్చక్షు !
మొదటినుండియును తప్పక
ఆలోకించియె యుందువు
ఈ ప్రపంచవికాసమును ;
ఈ సిందురగిరిపరిసర
ములలో వర్ధిల్లినట్టి
వాకాటకరాజ్యపూర్ణ
వైభవమును చూచియుందు ;
వానాటివె ఈకన్పడు
వాస్తుశిల్పకళాకృతులు.

ఓ తేజోమయ భాస్కర,
పడమటించు నీ కరముల

స్పృశియించుచు వరదహస్త
మును నిలుపవో నాశిరమున
ఒకే ఒక్క క్షణకాలము !
దివ్యదృష్టి ప్రసాదించి
తద్వైభవపరాకాష్ఠ
చూపింపవో ? కనులుమూసి
కొని, విషణ్ణమయినమనసు
తో, నిదిగో ధ్యానమందు
మగ్నుడనయి కూరుచుందు,
జోడించుచు కల్పనాత్త
చిత్రఖండపరంపరల.

తిరిగి కనులు తెరచిచూతు—
స్వర్ణమయముగా, నోహో,
అంతా కనుపించు నెదుట
రామలక్ష్మణులకోవెల
శిఖరము లన్నీ బంగరె !
ఆ భోంసలెమహా లేమిటి,
ఆ బారాద్వారమ్మును,

ఛత్రపు గుమ్మటమేమిటి,
రామగిరి సమస్తమ్మును
హేమగిరిగ మారిపోయె !
నలుగడ హాటకకణములె !!
సాంధ్యవేళ బంగరుపొడి
వెదజల్లునో ! ఆజల్లున
తడిసి సర్వమును బంగరు
నీరూదిన యట్లు తోచు.

పాడుపడిన గుడికప్పున
మొలిచిన ఆగడ్డి, పండి
పాలిపోయికూడ, స్వర్ణ—
కాంతులలో మెరవజొచ్చె
అస్తమించు రవి బహుశః
పూర్వవైభవపు దళుకుల
దర్శన మొసగంగ బోలు :
భగ్నవిగ్రహముపై, కను,
బంగారు మలాము చికిలి
యట్లుదోచు సాంధ్యరాగ

తేజము ప్రసరింప, సన్న
పనితన మగ్గలముకాగ
ఖండితమగు ఆముఖమున
చిరశాంతికి ద్యోతకమౌ
గూఢమందహాస మ్మది
విలసించిన దభయ మిడుచు
చరాచరపు జగత్తునకు !

భగవంతుని ఐదవ అవ -
తారమయిన యీ వామన -
మూర్తిని పరికించు, డహో !
ఏకఖండమయిన ఎర్ర
రాతిలోన చెక్కినట్టి
నవతాలసుపూర్ణాకృతి !
రౌద్రరసపు మూసలోన
నఖశిఖపర్యంత మోత -
ప్రోతమయిన పూర్ణాకృతి !
ఓజోవ ద్వీరరసప్ర -
ధానమహాకావ్యమ్మది !

ఆప్రమాణ మాసంస్థితి
పరిమండిత ; మదె, కనుడీ
నిలబడి నాభంగిమలో
నిశ్శంకమ్మయిన దీటు
పెచ్చుతగ్గు లేమిలేని
అవయవముల బిగి కనగా
మహోయోధు వజ్రశరీ
రమ్మట్టుల నిండుదనము,
నందము, రేఖావత్త్వము
గలిగి, చక్క గోచరించు ;
పెందొడలను జీరాడెడు
ఉత్తరీయ ; మా మొలపై
బిగించినది మౌంజిరశన ;
సింహసమానోర మ్మది ;
అష్టదిశల వ్యాపించిన
మహోవృక్షశాఖల వలె,
విక్రమమ్ము వెలికిచూచు
అష్టభుజము లుద్గమించు
సువిశాలస్కంధ మ్మదె!

బలిరాజు శిరస్సుపైన
కుడిపాదమ్మొత్తి మహా -
భారమ్మున పాతాళ త -
లమున కతని నణచివైచె.
దానశూరవీరు డయిన
బలిరాజో, శిరముపయిన
చండభారమును ధరించి
అవనతుడై పోయినాడు ;
కాని అతని ముఖముద్రను
ధీరాచల నిర్వికార
లక్షణములె గోచరించు ;
సత్త్వాపాల నాత్తశాంత
సంతోషమె చెక్కుచెదర
కతనిముఖముపై విలసిలు ;
వామను నాశీర్ష మ్మును
ప్రభామండలమును, ముఖ
చ్ఛవి, గనుమా, శాంతశూర
భావమ్ముల యద్భుత మి -
క్షణము గోచరించునహో !

ఆ విశాల ఫాలముపై
ఆకృష్ట భ్రూకుటులును
స్ఫురితనాసికాపుటమును
కంపితోష్ఠములును గాగ
త్రైలోక్య వ్యాపియైన
మహావిక్రమత్రివిక్ర
మాద్భుత వామనరూపము !!

శిల్పకళా విజ్ఞానము
కొంచెముకలదేని, కనుము,
ఛిన్నము విచ్ఛిన్నమునగు
ఈ విగ్రహమందున, రే -
ఖాసంగతిచూచి కనులు
చెమరించునె ! అరయగ, ఈ
ఒక్కొక రేఖయు తానుగ
స్ఫుటమగుచును, మొత్తములో
సమసించుచు, స్థాయియు నవ
రోహియునౌ స్వరవిలాస
మో యనగా, ద్రుతలయముల

తానమునా, రుద్రతాళ
మున భైరవి ఆలపించు.

భావుకులౌ భక్తజనుల
కీ ఖండిత విగ్రహమున
భగవదధిష్ఠాన మ్మది
ఏదీ, దేవాధిదేవ ?
పొట్టకోసరము, పాపము,
చేరిన పూజార్లు జారు -
కొనిరి ; మ్రొక్కుబడుల కొరకు
ఆయాసంపడిన స్వార్థ -
భక్తులెల్ల రరిగినారు.
నాస్తికుడను నేను నేడు
నిజమానసభావములను
కల్లోలిత హృదయభావ
నమ్ములనీ పూజసేతు ;
కళయందలి అమరజీవ
మునె, మానవతావికాస
మునె, భగవత్ప్రతిష్ఠ యని

భావింతును నే, జనతా
జనార్దనునె మదినెంచుచు.
మరి నాయీ మానసపూ -
జకు ప్రకృతియు సహకరించు.
దేవా, సాయంకాలపు
టారతి యెత్తునభానుడు,
నిజకరముల సాంధ్యతేజ
నీరాజన మర్పించుచు ;
శిరమున మందానిలుండు
ఛత్రచామరములు పట్టు ;
నవవికసిత తరుశాఖా
కిసలయములు వాసంతసు -
గంధమంజరుల నీచర-
ణమ్ముల పూజలు పెట్టును ;
శుష్కపీత పర్ణమ్ముల
వనమర్మర నిస్వానము
మంగళారతులు పాడును ;
హృదయ మనాహతనాదము -
ల మృదంగ ధ్వనులుచేయు.

నాపూజ సమాప్తిచెందె;
ఇపుడెల్లయు శాంతమ్మయి
స్తబ్ధమ్మయి గోచరించు;
మెలమెల్లన అంధకార
మావరింపసాగె; మనసు
లోని ఒకానొక ఉద్వే -
గమ్ము దుఃఖదస్మృతియగు
గబ్బిలమును మేలుకొల్పె.
వాస్తవమను ప్రత్యూషపు
కాంతిలోన తలక్రిందుగ
ప్రేలాడుచు గాఢమ్ముగ
నిదురించినయద్ది, రెక్క
లను రెప రెపలాడించుచు
కల్పనానభమ్ములోని
కెగురజొచ్చె తా నిప్పుడు.

అకటా, నా మాతృభూమి !
ఎటకేగిన నచ్చటనే
శిల్పకళాకృతు లుస్మ్మా -

లితములుగా గనుపించెడి,
ఎన్నెనో భగ్నమయిన
దేవళములు, విగ్రహములు !
ఎంతగ నిర్మాణము జరి -
గినదో యంతగా విధ్వం
సము జరిగెను ; దానిని పే -
ర్కొనబూనుట శక్యమగునె ?

కనుమ, అజంతాలోగల
చైత్యముల, విహారములను,
సాటిలేని కుడ్యచిత్ర
ముల, నట బుద్ధుని సమాధి
భంగపాటుచెందె ; చిత్ర -
ముల రంగులపొరలు డుల్లె.
వానిని ధ్వంసముచేసిన
వారు జగతి కెంతహాని
కలుగునొయని యెంచినారె !
ప్రియుబాహులు కంఠమ్మున
గల నాయిక ఒకకంటను

కోమల విశ్వస్తభావ
మెలయింపగ, రెండవనే -
త్రమ్మున, నాశమ్మె యొదవె.

ఎల్లోరాపర్వతముల
కైలాసమ్మును దేవళ
మిద్ది వాస్తు శిల్పమ్మున
కైలాసమువంటిదె యగు ;
మింటినుండి దిగివచ్చెనో
పూర్ణముగా ననిపించును.
విధ్వంసకహస్తమ్ములు
ఉన్మాదముతో విగ్రహ -
భంగముచేసెనో యనవలె.
గజరాజమ్ముల తొండము
లగలించిరి తగులబెట్టి ;
కనుపోయిన విగ్రహములు !
ముక్కుతెగిన విగ్రహములు !!

'భాజే', 'కార్లే' లలోన

గల సుందరకందరముల
కును ఈ గతియే పట్టెను.

ధారాపురగుహలందున
గట్టిరాతిలో చెక్కిన
శిల్పమ్ములు, శివతాండవ
మును, పార్వతిపరిణయమును
దేవీదైవత రూపము
లును - వాని వినాశముగని
హృదయము తరుగుకపోవును.
ప్రళయంకరు నారుద్రుని
హస్తపాదములె, తాండవ
నృత్యమున విలీనమయ్యె;
పాణిగ్రహణమునందలి
హస్తమెచేడ్వాటు గనియె.

ఉత్తరభారతమున, సు
దూరోత్తరమునను, నెల్ల
అగలించిన ధ్వంసకుల కు -

చర్యలచే భగ్నము కా
నిది యొక్కటికూడలేదు.
జగతీవిఖ్యాతి గన్న
సాంచీస్తూపమ్మున గల
తోరణములు ధ్వంసమయ్యె;
మరి, కను, డాదగ్గరనే
దేవానాంప్రియుడౌ ఆ
ప్రియదర్శియు, ధర్మపాల
బిరుదాంచిత చక్రవర్తి
యునునయిన అశోకన్నపుని
సింహస్తంభ మదికూడ
ఉన్మూలితమయ్యె, నయో,
మూడుప్రక్కలై, అకటా!

పెద్దపెద్ద నగరములను
నెలకొల్పిన పురావస్తు
సంగ్రహాలయములవంక
ఒకపరి పరికించినచో
ఆ కుట్టిమితాంగణములు

విరిగిన విగ్రహములతో
నిండియొగద కానబడును.

మథురలోని పురావస్తు
సంగ్రహాలయము లోనికి
అడుగుపెట్టగానే, ఆ
సింహద్వారము దగ్గరె
కనుడు, కుషాన్ సమ్రాట్టు క -
నిష్కునిదౌ భవ్యవిగ్ర
హమును, దానిపయిని బ్రాహ్మి
లిపిలో చెక్కిన బిరుదా
వళిని ' మహారాజా రా -
జాతిరాజా దేవపుత్రో,
కానిష్కో ' అని ; కానీ
మొండెము మాత్రము మిగిలెను.
ఏ దుష్టధ్వంసకు చే -
తులలో నద్దానిశిరము
భిన్నమయ్యెనో, అకటా !
మరి మన పుణ్యక్షేత్రము

లందున కేవలము నొక్క
కాళిగూర్చి తలపోయుడు ;
దగ్గరనే సారనాథ
మున్నది ; బుద్ధుడు మొదటగ
ధర్మము నుపదేశించిన,
ధర్మచక్రమును ప్రవర్తి -
లగచేసిన స్థాన మద్ది.
అచటగల అహింసా త
త్త్వము నెగతాళించు కళా
హింస ; దానిగను, మీలిత
నేత్రుడయిన తథాగతుడు !
అనపేక్షితవిధి లిఖిత
మ్మిది యెంతటివిపరీతము !

ఎంతకళానిర్మితియో
దానివెనుక నిర్మాత్రిగ
వెలసిన సంస్కృతిఎంతో !
ఆ సంస్కృతివే గాదా
కళలోగల చైతన్యము

ప్రాణము ; నవి పాడుపడిన
విచ్చట విధ్వంసమంది.

కళకు జన్మయిడినట్టిది
సంస్కృతియే ; దాని విలా—
సమెయగు నీ కళావిద్య
లను రెండును, వృక్షమ్మున
పల్లవించు మంజరులన.
అసంఖ్యాకసుమములలో
సూక్ష్మబీజములవెన్నో
నిండియుండు ; వానినుండి
ముందటి సంస్కృతినవ ని -
ర్మితిగా, తావెలయుగదా !

ఇందున నీ కళావిద్య
లను రెంటిని పోషించుచు
రక్షించును సంస్కృతియే.
ఈ రెండిటి సమ్మేళన
మున ముందటి సంస్కృతి గు—

ర్తింపగు; నవ్వియె సంస్కృతి
అస్తిత కాధారమ్ములు.

మరి కనుమా, నీయొాకళ
సర్వమ్ము నసామకమ్ము;
పేరుచెందిన ఫలానా
కళాకర్త దీ శిల్ప
మ్మని వచింపలేముగదా!
ఎవడింతటి నిర్మాణము
గావించెనో అట్టి శిల్పి
పేరేడను చెక్కలేదు.
ఈ నాటికిని తమకళా
సంపదలో జీవించును
ఆజనముల భావనయును
ఆజనముల సంస్కృతియును.

పుణ్యస్మరణుండగు నా
కవికులగురుకాళిదాసు
జనకసుతాస్నానపుణ్య

జలములుగల రామగిరిని
నివసించెన ; టంతవాడు
ఏమి పెట్టిపోయె జగతి,
కాళిదాసనే తనవే -
రొక్కటియేగాక ? అతని
వ్యక్తిత్వము లీనమయ్యె
సువిశాల సమష్టిలోన
కాని అమరకావ్యములం
దున, ఆ గత సంస్కృతి జీ -
వించియె యున్నదికాదా ?

ఇప్పటికిని గను, డాపా
ఢమ్మున నారామగిరిని—
ఏ కుటజము కుసుమమ్ములు
యక్షుడు మేఘునికర్ఘ్యము
గాగనిడెనో, ఆకుటజము
విరగపూచి యందగించు ;
కాళిదాసు వీక్షించిన
ఆ తారాపథమే యి

ప్పటికిని కల ; దప్పటి ఆ
గంధాంచిత మందానిలు
డీనాడును వీచుమెల్ల ;
ప్రకృతియు నట్టులనె కళా -
నిర్మాణము జరిగిన ఆ
నాటినుండి కళాకృతుల
విధ్వంసము జరిగిన కా -
లమువరకును నొక్కరీతి
సాతత్యము తా వహించు.

సర్వనాశనమునకు మూ -
లమునసంస్కృతి ప్రాసమె గద !

ఎంతటివైభవ మిచటి
రామగిరిని వెలిగిపోయె !
వాకాటక రాజవంశ
మున, రెండవ ప్రవరసేను
మాతృశ్రీ యగు ప్రభావ -
తీగుప్తాదేవి యాత్ర

వచ్చి, రామగిరిస్వామి
పాదాంబుజ పూజ సేయు
క్రాలమ్మున విలసిల్లెను
రాజ్యలక్ష్మి! నేటి కెల్ల
విలయమ్మైపోయె, కటా!
ఇచటికి దగ్గరలోనే
'పేంచ' నదీతటమునుండి
ఆమడ విస్తారించిన
నందపురమ్మును విధ్వం -
సితనగరము గోచరించు;
చెత్తచెదారముల మీద
నటపెరిగె ఘనారణ్య,
మ్మద్దిదాట, జీర్ణశీర్ణ
మౌ నవశేషము లగపడు;
నలుగడలను కను, డిటుకల
పెనురాసులు పడియున్నవి;
రాచనగరు పునా దిదే,
పెకలించిన ప్రాకార -
మ్మిదె; నగర మ్మదిహొల్లను

F 3099

ఉద్ధ్వస్తము ; నృపతులు వ -
ర్ధిల్లిన యచ్చో నక్కల,
గూబల యేల్బడి సాగెడి !
ఇరుప్రక్కల కొండలపై
నేటికిని నభేద్యదుర్గ
ములు ఖిన్నమ్మగుదృష్టుల
ననిమేషముగా బరపుచు,
వాకాటక వంశీయుల
రాజధాని వారితోనె
మంటిలోన గలసిపోయె
నని పలికెడు ; సంస్కృతి, కను,
డెట్టులుగా వినఁగించెనో !

అసలీ సంస్కృతినాశ
మ్మెట్లు జఱుగునో, కనుడా.
ఈ జగమున నిజసంస్కృతి
పాటింప దలంచువారు
ప్రాణమ్ముల నొడ్డియైన
ఈ చిక్కు నెదుర్కొనవలె,

జగత్కథను పఠింపవలె.
కనుడు, ప్రపంచేతిహాస
మేమి యనునో—రాజ్యములవి
ఒకటొకచో యెట్టు లంత
రించెనో యనువిషయములో :
సంస్కృతి లోడొల్లవడును
సాభా ; లందలితేజ
మ్మంతరించు నించుమించు ;
లోపించు విచారశక్తి ;
విద్యలు కేవలము పుస్త -
కీయములగు, నిరుపయోగ
మును, నిశ్చేతనమునగుచు,
జనజీవన దూరస్థము
లును గతసామర్థ్యములును
నయి ; కుంటెడి నభ్యుదయము ;
నవవిచార మడుగంటును
దేశజీవనవికాసక
మౌ శక్తులు మరపునబడు.
ఆత్మరక్షణార్థ మ్మగు

సామర్థ్యము మెలమెల్లగ
వెనుకబట్టు ; నిజరక్తక
సంఘశక్తిచర్య లెల్ల
ఉపేక్షితము లయిపోవును.
కొద్దిపాటి అనాగరక
జనము కొత్తయావేశము
తో, పునాదిలేని తత్త్వ
మొకటి తమనుప్రేరేచగ
ఎత్తి, జీర్ణదేశముపై
జయముగొంద్రు ; సత్యమత మొన
రింతురచటి మృతసంస్కృతి.

బుద్ధిశక్తి, నాత్మరక్ష -
ణ ప్రధానతను దెలియుము
రెంటి జక్క జోడింపుము
ఏ ఒక్కటి నిర్లక్ష్యము
చేయకుమా ; అట్లగుచో
నే, జగమున జీవించుట.
కాదంచువో, నాశనమే ;

వేరొక్కటె మిగులునుమరి.
సృష్టివికాసక్రమమును
దీనినె వక్కాణించును.

ఈ జగత్తులో కొండం -
తటి ప్రచండజీవమ్ములు.
బ్రతికి సుఖముగా గతించె
భీమసరట, బిధురసరట
వర్ధబాహు సరట, మీన -
సరటమ్ములు ననగా ; నవి
ఎల్లపుడు సరీసృపములె.
పుత్తదంత మన్మథములు
ననెడు బృహదనేకపములు
ఆ జాతులవంతరించె.
అవనిగర్భమున చివికిన
వాని యస్థిపంజరములు
మాత్ర మిల, తిరముగ మిగిలె.
అనియన్నియు బృహద్దేహ
కమ్ములు, శక్తిమంతములును,

కానివాని మెదడుచూడ,
ఎంతో చిన్నది, అల్పము ;
సుఖదుఃఖము లెరిగియునవి
దీర్ఘసూత్రవృత్తికలవి ;
ఆత్మరక్షణకుగానీ
ప్రతీకారమునకుగాని
వానిమేనులపయి నెట్టి
నిసర్గాయుధములులేక,
చపలములయ్యును బుద్ధిబ -
లముగల యల్పాకారపు
హింస్రజీవములు వాని స -
మూలము నాశనముచేసె
దీనినుండి ప్రకృతియె తా
నీతి గ్రహించినది, బృహ
ద్దేహమ్ములు, కోట్లజీవ-
ద్రవముల నిర్మించి, త్యాజ్య
మీయత్నమ్మని విడచెను.
బుద్ధివికాసాత్మకమగు
అభ్యుదయపథమ్ము పట్టె.

ఈ రెండవ మార్గములో
అభ్యుదయము జరుగగానె
అల్పమర్కటమ్ములకును
పెద్దటీకమువచ్చె ; వీని
నుండియె మానవవికాస
మవతరించె ; నంతనుండి
అల్పబలుడునయ్యు, బుద్ధి
సహాయమున, బుద్ధిశక్తి
చేత నెల్ల సృష్టివయిని
విజయము సాధించె జనుడు.
పెద్దపెద్ద ప్రాణుల తన
వశముచేసికొనె ; ప్రకృతికి
సైతము బందములు తొడిగె ;
పెరుగుచున్న బుద్ధిశక్తి
చే నవరోధకరమయిన
సర్వశక్తులతో నప్ర-
తిహతముగా పోరుసలువు.

బుద్ధిబల మ్మాలోచన

లోనగ్గలమగు ; దాని ప్ర-
బలశక్తిని గుర్తింపుడు ;
ఆలోచనచే, తత్త్వవి-
చారముచేతను మానవ
జాతియెల్ల కంపించును ;
స్ఫూర్తిగొనుచు ప్రోత్సాహము
పొందినంత, మహాకార్య
సాధనకై ఉద్యమించు ;
అసంభవము సంభవమని
ఋజువుచేయు ; ప్రేరకమగు
ఇంతచండశక్తిగలదు
తత్త్వవిచారమ్మునందు,
ఆలోచనయందు నరయ :
దీనికి దృష్టాంతమ్ము ల-
సంఖ్యాకముగానున్నవి,
ఒకటి రెండు గ్రహింయింతము-
ధర్మక్షేత్రమ్మగు నా
కురుక్షేత్రమందున కురు
పాండవ యుద్ధారంభపు

సమయమందు వీరార్జును-
డయ్యెను హతబుద్ధి; వాని
తలపులు దుర్బలములయ్యె;
తేజము నుత్సాహమ్మును
అవసన్నములయ్యె; పలుక
సాగెను ప్రజ్ఞాహతుడై
తాత్త్వికవాక్యమ్ము లకట!
అంతట భగవానుడతని
ప్రేరేపించెను తేజో
వద్విచారతత్త్వజ్ఞా
నమ్ము కర్మయోగము గీ-
తోపదేశముగ నొనరిచె.

ఆ సమర్థరామదాసు
ఛత్రపతిశివాజీయును
మేలొల్పిరి మహారాష్ట్రము;
రామదాసు వాక్కులువిని
మరాఠీలశౌర్యమ్మును
సామర్థ్యము ప్రజ్వలించె;

'అగ్గియొకటి అంటింపరె
అటుపైనదె అంటుకొనును'
అన్న రామదాసుపల్కు
విన్నమహారాష్ట్రులలో
స్వరాజ్యాగ్ని విస్ఫురించె,
మెతకమావలులుకూడా
'హరహరహర మహాదేవ'
అని ఆహవగర్జసేయ.

బుద్ధిభ్రష్టమగుచో, కను,
డెటు లణగునో తేజోబల,
మత్తమిలునో చండశక్తి!
ఎన్ని యుద్ధభూములలో
విజయశ్రీ జయమాల ధ-
రింపనున్న రాజకూర
సేనలలో, రాజో, నే-
నానియె, హతు డయినవార్త
వ్యాపింపగ సేనయెల్ల
గుండెజారి, దిక్కులేక

వెన్ను చూపు ; ధైర్యముడిగి
నట్టి శత్రులకు చౌకగ
విజయశ్రీ కైవసమగు,
రాజ్యమ్మిక కొల్లపోవు.

ఈగతి మిథ్యాజ్ఞానము
చే నెన్ని పరాజయములు
కలిగెనో ; రాజుదె రాజ్యము
దేశమెల్ల నృపునిదె, మరి
సేనయెల్ల పుహిపునిదే,
యుద్ధములవి రాజుకొరకె,
అని భావించిన మనలకు.
రాజట మృతుడయినవార్త
పొక్కగనే పోరి ప్రయో-
జనమిక లేదంచు సేన
కుత్సాహ మ్మొడుగంటును.

దీనికి విపరీతమయిన
పరిస్థితిని గనుడి ; ఆత్మ

విశ్వాసముగలదినముల
మహారాష్ట్రమెల్ల మరా-
ఠీల దయ్యో! తత్సంపద
కధిపతులై వారునెగడ;
నాడెరుగదు మహిపతియో
రాజారామెవరో ప్రజ!
ఏకహృదయులై పోరిరి
మహారాష్ట్రస్వాతంత్ర్యము
రక్షణకై మరాఠీలు.
వేరువేరు మనస్తత్వ
ముల లీలాపద్ధతులివె!
మరొకమనస్తత్వమరయ,
క్షత్రియుడనువాడు యుద్ధ
మొక్కచే యొనర్పవలెను;
బ్రాహ్మణుడో మంత్రజపమె
చేయవలయు; వైశ్యుడు వ్యా-
పారమునకె, శూద్రుడు మరి
సేవకె అమరింపబడిరి.
సుఖదినములెకానీ, అది

కష్టకాలమే కానీ
ఎల్లవార లీ ధర్మమె
పాటింపగ వలయునంట.

ఈ స్థితిలో పరదాస్యము
పైకొనిరా, " దేశమగ్ని
ప్రమాదమున చిక్కుకొనియె ;
జనులారా, బ్రాహ్మణుడెవ,
డెవ్వడు క్షత్రియుడు, వైశ్య
డెవ్వడు, మరి శూద్రుడెవడు !
మాతృభూమికొరకై ప్రా-
ణము లర్పింపగ నెల్లరు
సైనికులై రారే " యని
పెచ్చరించు వాడెవడును
లేనిచో వినాశమెగద !

ఇట్టి వినాశంకరభా-
వనలె, పరాజయకారక
మనస్తత్త్వములె, సూత్మపు

బీజములై అంకురింప
జొచ్చెను మనదేశములో ;
ఒక్క మహావటవృక్షము
గా వర్ధిలి నలుగడలను
వేళ్లుపారి, ఊడలుదిగి
నేలమీద నిట్లుమరల
విస్తరించె ; సంస్కృతిదే-
వాలయమును చుట్టుమ్ము క్టె :
దాని రాతిగోడలలో
దాని పునాదులలో శి-
టులు పారించెను నెల్లెడ
శిఖరముదాకను పగుళ్ల
తో శిథిల మ్మాయెగదా
దేవాలయమెల్ల, కటా !

మహాతత్త్వవేత్తలు, మత
సంస్థాపకు లెందరిచట
అవతరించిరో కనుడీ.
బుద్ధుడును మహావీరుడు

నాచార్యుడు శంకరుడును
నిస్సందేహముగా నె
ల్లరు వంద్యులు, పూజ్యపాదు
లును, జన్మించిరి జగతీ
మానవకల్యాణార్థము.

ప్రకృతి అరయ నిర్దయమై
కాలము తా నిష్ఠురమై
ఎల్లతత్త్వములపరీక్ష
నొనరించును ; అట్టి మహా
తత్త్వమ్ముల నెగురగొట్టె
దుమ్ముధూళిగా, నరయుడు
ప్రత్యక్షపు జీవన మను
గీటురాతిపై నవి తా
మెంతవరకు నిలిచినవో
కనులుతెరచి కనుగొనరే
స్పష్టముగా ; ఆ మహాత్ము
లే కానని సంగతులను
కాలము కనబరచుచుండె!

జీవితపు వికాసాభ్యుద
యమ్ములకై వా రుపదే-
శించినట్టి సద్ధర్మము
బోధపడియె కాకయె, శ్ర-
ద్ధాళువులై మన పూర్వికు
లున్నతికల్గునను నాస
నాచరించుచును వచ్చిరి.
వారలకును వారి తరము
వారికిని వినాశఫలమె
లభియించె; నహింసకులకు
హింసయె తా సంఘటిల్లె;
ఇహలోకమ్మిది యెల్లను
'మాయ, మిథ్య, భాస' యనుచు
ఆత్మమోక్షమునకై జత
నించినవారికి త్వరగా
స్వర్గమ్మే గోచరించె!
దాస్యపంకమున వారట
మలినమానసమ్ములతోడ
పడియుండిరి, పోగొట్టుక

ఇహ మైవైభవపాళినెల్ల.
ఆతత్త్వజ్ఞానమ్మది
ఆధర్మ మ్మా భావన
లుదాత్తములెగానీ, మరి
దివ్యసూక్ష్ములెగానీ,
సాక్షాత్తుగ భగవంతుని
ముఖతః వెలువడినయట్టు
భాసించునుగాక ; కాని
వాని నాచరింపకుడీ,
బోధగొనకుడీ, వ్యాఖ్యా
నింపకుడీ ; ఈ జగతిని,
నీ జీవనమున, నీదే-
హమ్మున, నీకన్నులకే
సర్వోదయ మదిగోచర
మేకానపు డామార్గ
మ్మా యోగము నేమిటికో !
ఈ లోకము మిథ్యయు ఈ
మానవదేహము, నీ జీ-
వనమును తుచ్ఛముగ దలచు

అతత్త్వజ్ఞానమ్మది
భ్రామకమని తెలియుడయా !
మనుజవిరోధకములయిన
భావనలవి నిశ్చయముగ
రూపెత్తిన వినాశమ్మని
తెలియండో, తెలియండీ !

ప్రకృతి యన్నదో, నైతిక
తత్త్వముతో సంబంధము
లేనిది, మరి ధర్మాధ-
ర్మముల, పుణ్యపాపమ్ముల
నొడ్డునకును దొలగద్రోచి
వర్తిలునొక మహాశక్తి !
దాని దండనములు కఠో
రములు, చరాచరజగత్తు
నొక్కుమ్మడి తాడించును.
దాని వినాశంకరమౌ
శక్తులు భూకంపరూప
మున ప్రకటమ్మయినప్పుడు

దేవాలయమేగానీ
మదిరాలయమేగానీ
సాధుకుటీరమెగానీ
దుష్టుని భవనమెగానీ
ఒక్కపరిగ విచారించి
ఒక్కదెబ్బ గూల్చివేయు,
మనుజుడు నిర్మించుకొన్న
విధినిషేధములనుగాని
ధర్మాధర్మములగాని
ఇంచుకేని లెక్కగొనక.
సాగర గర్భమున తుపా
నుద్భవిల్లి ఓడమునుగు
నపుడు మహాపాపియైన
ఈతగాడె బ్రతికిపోవు,
భవసముద్రతారకమౌ
పుణ్యనంచయమ్మచ్చో
నెందునకును పనికిరాదు.
కనుడు ప్రకృతి సత్యరూప

మును—గుణత్రయాత్మకమై
సృష్టి స్థితిలయములుగా
త్రివిధముగా ప్రకటమగును
దాని సృష్టిశక్తి యనం
తము; జగమున నెన్నతెంపులు
లేక వృక్షలతాపుష్ప
ఫలములను, ననంతకోటి
జీవరాసులను సృజించు
చైతన్యము వికాసింప
సమృద్ధముగ, ప్రఫుల్లముగ.

అటులే ఆప్రకృతి స్థితి-
రూపమ్మున శాంతశీత
లాహ్లాదనదాత్రియైన
జగద్ధాత్రివోలె, కన్న
తల్లివోలె, నిజసంతా
నమును తాను స్వేచ్ఛతోడ
పోషించును, రక్షించును.
ఇంక లయమొ, ధరియించు కృ-

తాంతరూపమే, కరాళ
ప్రళయంకర నిష్ఠురముగ-
పంచమహాభూతమ్ములఁ
నుడికించుచు వికటమహా
తాండవనాట్యమ్ము సల్పి
సృష్టిని విధ్వంసము చే-
యును స్వేచ్ఛాపద్ధతిగా.

—ప్రకృతికిదే ఆట సదా
కాలచక్రభ్రమణమ్ములఁ.

ఇట్టి ప్రకృతి యొడిలోనే
మనుజుడు జీవింపవలయు ;
ప్రకృతిచేత పరివేష్టిత
మెల్ల మనుజజీవితమును.
మానవజీవితమె తాను
ప్రకృతిలోన సంఘటిలిన
దౌటచేత, దానిభావ
నాంశయగుటచేత, నరుడు

ప్రకృతిలోని సర్వశక్తు
లను గణనము సేయవలయు.

మానవజీవితములోన
ప్రతిబింబతమగును ప్రకృతి
లోని సర్వశక్తులునవి.
ప్రకృతిలోన నిర్మాణము
గాంచి నరుడు, స్ఫూర్తిగొనుచు
కళాకృతులతో సుందర
సృష్టిని నిర్మించుకొనును
ప్రతిసృష్టియొకానీ, మరి
ప్రతిబింబమ్మదికాదే !

ప్రకృతిలోని సౌందర్య
శ్రీ మనసారగ నాస్వా
దించి, దాని స్థితిరూపము
లో విశ్వాసమ్ము నిలిపి
మనుజుడు నిర్మించుకొనును
భవ్యమైన కట్టడములు.

మూలమందు నణగియున్న
పాశవస్వభావములో
యుద్ధతృష్ణబలిసిరాగ
హత్యాకాండమ్మె యగును.
సర్వనాశకజ్వాలల
వెలిగ్రక్కుచు మానవకృతు
లెల్ల మానవుండె కూల్చు,
మనుజనాశమున కుద్యత
పడు మనుజుడె దానవుడై.

ప్రకృతిలోన గోచరించు
ఆస్వభావ మాశక్తియు
అట్టిలక్షణములన్నియు
మనుజునిలో వ్యక్తపడును.
అంతకంటె గూడ, మాన-
వత్వ మధికమయి నెగడును.
ప్రకృతికిగల కడసీమయె
మానవకృతి కారంభము,
వికాసించు నచటనుండి

మానవత్వ, మదిదాటుక
ముందునకును పోవుకొరకె
ప్రయాసించు మానవుండు
ఆ ఉద్దేశము సిద్ధికె
వాని శాస్త్రములు, కళలును,
విద్యయు, తత్త్వజ్ఞానము,
ధర్మము, నాచారము, భా-
వనయు, నీతినియమములును.

మనుజజాతి కళ్యాణము
కల్గునాస, ప్రకృతికంటె
నరునియందె అధికముగా
కేంద్రితమయి గోచరించు.
అట్టి ఆశ ఇహమునందె,
ఈ లోకమునందె సఫల
మొందవలయుచో మనుజుడు
వెచ్చించుచు తనదుశక్తి
సర్వస్వము, నిత్యమును ప-
రిశ్రమించవలయుగాదె!

ప్రకృతిలోని సంధారక
శక్తి కూర్చుకొనుచు, నేర్పు
తోడ, మనుజకార్యములకు
అడ్డువచ్చు నాశక సం-
హారకశక్తుల ఛాటిని
నిత్య మెదుర్కొనవలయును.

ఏది మనుజజాతిని తా
కార్యశూమముగ ప్రవృత్తి
పరముగ నొనరించునో, నర
కల్యాణముకొరకై ని-
త్యము నుద్యుక్తమ్ముగునో,
ఇహజీవితమును సుఖదము
గా నొనర్ప బోధించునో,
ప్రకృతిశక్తితోడ మనుజ
వృత్తుల సమ్మేళవింప
నుపదేశము చేయునో, అదె
అరయ సర్వశ్రేష్ఠమయిన
మానవధర్మమ్ముగదా !

మానవ భావనలు, నీతి
విద్యాతత్త్వజ్ఞానము,
లాచారము లవియన్నియు
ఈ జగమును తుచ్ఛముగా
లెక్కించుచు ప్రకృతినెపుడు
విస్మరించునో అప్పుడె
మనుజ నాశకరములుగా
పరిణమించు ; ప్రకృతియొక్క-
సూటియైన నియమముగన—
దాని అసలు రూపమ్మును
తెలియనట్టివారును, త-
న్నిర్మితమౌ పరిస్థితుల
కనుకూలముగా వర్తిం-
పనివారును, ఆత్మరక్ష
కొరకు నిత్య జాగరూక-
తను వహించి, పరిస్థితుల
కనుగుణముగ, మార్పుచెందు
చవసరమున నెదిరిదాడి
నెదుర్కొననివారు, నరయ

నేడు కాకయున్న రేపు
నాశమునొందుట తప్పదు.
వారిపారలౌకిక ధ-
ర్మమ్ము, లరయ, వారికి నిహ
లోకరక్ష గూర్పలేవు.

ప్రకృతిశక్తి నెదుర్కొనుట
లోనె, దానియడ్డంకులు
తొలగించుటలోనె, పంచ
మహాభూతముల జయించు
టందె మనుజశక్తి వికా-
సమ్మొందు, చైతన్యమ-
యమ్మగు జీవనమదెల్ల ;
మానవకల్యాణమునకు
ప్రకృతి తోడ పోరుసలుపు
చంతమగుటలో సయితము
జీవత్తను చెందుప్రాణి.
అట్టివారిపేర్లె చిరం-
జీవములగు, వారివంశ

ములు వైభవ సహితములై
వర్ధిల్లును జగతిలోన.

కనులువిప్పి అరసినచో
మనకును మనపైవిజయము
సాధించిన వారలకును
గల భేదము స్పష్టపడును.
మన సంస్కృతి కొఅతే ఇది.
ఇహలోకము నుపేక్షించి
ఇహవిభవము తుచ్ఛముగా
పరిగణించి, చవట కర్మ
ఫలసిద్ధాంతము నొక్కటి
మెడకు నంటగట్టికొనుచు
పరలోక స్తోత్రమ్ములు
నేయుచు, నిజరక్తణ భా-
రమును శిలాదేవులపై
వైచి, చేతులను ముడుచుక
కూరుచున్న ఫలమేమని ?
కర్మకు దూరులమైతిమి

భ్రష్ట భావనుల మైతిమి.

రాతిదేవ విగ్రహాముల
దేవత్వము నీమూలము
ననె వచ్చును ; నీ భావన
దే యరయగ ఆతేజము ;
నీ దేవుని రక్షించుట
నీపనియే ; దేవునిపై
విశ్వాసమ్మును శ్రద్ధా-
నిష్ఠలున్నచో, నీలో
సయితము వానిని గూరుచు
కొను; మేలన దేవకార్య
ములు నీ ద్వారాయె జరుగు ;
నీరక్షణ జరిగినచో
రక్షయగును దేవునికిని.

కనుమ, ఎంతరక్షణలే
కుంటివో ! మరి ప్రకృతిలోని
సంహారకశక్తి హింస్ర-

మానవరూపమ్ము దాల్చి
విచ్చలవిడి నీపై బడి
నీ సర్వస్వము హరింప,
క్రూరమనుజజాతి నిన్ను
భక్షించుట కెత్తిరాగ
సుఖముగ నిదురించుచుంటి ;
గుండెగాయపరచుదాక
ఇచ్చవచ్చినట్లు నిన్ను
చీల్చుకొనగ నిచ్చినావు,
నీ సోదరురక్షణకై
త్వరపడగా లేదు నీవు.
నీదురక్షణమ్ము కూడ
సాధ్యముకాలేదు, కటా !

సోమనాథు దేవళమున
వేలకొలది భక్తులుకల ;
రైనను సమయానికి ర-
క్షణ మరయగ జరిగినదో ?
అవసరమే లేకపోయె ;

ఏలన, ఆరాతిలోని
భగవానుడె, ఆత్మరతు,
భక్తరతు నేయ శక్తి-
మంతుండని భావించిరి ;
విగ్రహాముల వైరివచ్చి
అగలింప, బయల్పడె మన
శ్రద్ధలోని లొచ్చులెల్ల
ఇపుడయినను, కనుమా, మన
మెంతగా అరక్షితులమొ !

మనసంస్కృతి అదియెల్లను
రక్షాతంత్రము సుపేక్ష
చేసి ధ్వంసమయ్యె, నాశ
కులు విధ్వంసము చేసిరి.
అర్థములేకుండ యెల్ల-
లను విస్తారించుకొనుచు
కూర్చుంటిమి ; నిత్యమ్మును
జాతి సంప్రదాయమ్ముల
పేరిట వ్యర్థముగ భేద

బుద్ధి పెంచుకొనుచు కూరు-
చుంటి ; మింక, సంఘశక్తి
మూలకమౌ వైక్యభావ-
నను మూలకు నెట్టినైచి.

కనుమా, నిజరక్షణకై
స్వత్వభావనమును పెంచు
కోవలయును ; సంస్కృతియను
ఐక్యభావ పరిధిలోన
సంతానమునెల్ల చేర్చి
వారిలోన 'మన మందర
మొక్కటె' యను భావనగా
ఆత్మీయత పురిగొల్పుచు
అల్పమ్మ్మును కృత్రిమమును
నైన భేదభావమ్ములఁ
తొలగించుచు జీవనాంగ
ణము విస్తారింపవలయు ;
దేశము నందంతట సం-
వేదనామయమ్ముగాగ,

ఒకేశరీరమ్మట్టుల
ఒకే హృదయమట్టు లైక్య
భావమ్మును పెంపవలయు ;
తమ సంస్కృతి, తమ సంపద
తమ యైశ్వర్యము, తమ దే-
వాలయములు తమదేశము
రక్షించుకొనంగ నెల్ల
జనులెప్పుడు సిద్ధముగా
నుందురో, తమ జీవనైక్య
మును గుర్తింతురో, అప్పుడె
ఆత్మరక్షణార్థమ్మును
ప్రతికారార్థమ్ము శక్తి
సామర్థ్యము లవి వర్ధిలు.

ఈ విరిగిన విగ్రహ మది
ఛిన్నభిన్న మయ్యు, మన వి-
నాశరహస్యమునకు సం-
కేతముగా నిలిచి ఎల్ల
వారలకేమని తెలుపును ?

అరయగ ఆ ఖండితమో
అష్టభుజము లేమను? మన
చేతులెంత భయదముగా
విరిగి ముక్కలైనవొయని
గదా తెల్పు; భిన్నమైన
శిరోభాగమేమనుచు-
న్నది? సాంతము భ్రష్టమయ్యె
బుద్ధి మీకు ననిగాదా?
దేశపురుష విరాణ్మూర్తి
శీర్ష మ్మును హస్తములును
ఎట్లు భగ్నమై భ్రష్టము
నష్టమయ్యెనో, అకటా!

మహారాష్ట్ర భక్తవరులు
సరళధర్మ భక్తిమార్గ
ముపదేశము చేసినారు;
ఈ నాటికి నామార్గము
ననుసరించు, చేటేటను,
వేలకొలది యాత్రికులిట

త్రిపురీ పూర్ణిమకు జరుగు
మహోత్సవమునకు వత్తురు,
ప్రభువు రామచంద్రమూర్తి
దర్శన మొనరించుకొనగ,
'జైరామా సీతారా-
మా' యనుచును భక్తితోడ
జయధ్వనుల నొనరించుచు
తాళమృదంగమ్ములతో
మంజుల సంగీతముతో
చేతుల జెండాలతోడ
భక్తివివశ నాట్యముతో
భజనలతో, భగవంతుని
ప్రభలుకట్టి, మెట్లదారి
రామగిరిని నెక్కుదురే,
శిథిలాంగులు, వికలాంగులు
ముదుసలులును, నింతలేసి
పసివారిని, చంటివారి
నెత్తుకొన్న ఆడువారు
నెల్లరు తా, మాకారము

నంటునట్టి, తెలివెన్నెల
నద్భుతముగ మెరయునట్టి
దేవాలయశిఖరముపై
దృష్టి నిలుపుచును వత్తురు
నలువైపుల నెడతెంపులు
లేకుండగ ; రామనామ
జయఘోషము లుప్పతిల్లు.
ఆ వైభవవర్ణనమున
కేశబ్దములును చాలునె !
అర్ధరాత్ర మారతిచ్చు
వేళకు పీతాంబరముల
త్రిపురదహనసమయానికి
లక్షలాది ఆరతులను
పర్వత ప్రదేశముపై,
శిఖరముపై వెలిగింతురు ;
ఎల్లవారు మైమరతురు
తన్మహోత్సవావేశము
లో, నల్గడ దోచు నపూ-
ర్వోత్సాహ మహోవేశను,

విగ్రహాముల విరుగగొట్టు
నానాడును నిచ్చోటను
ఈ ఉత్సాహమె కలదో !
ఆనాడును భక్తిధర్మ
మిదేకదా ! నాడు నుత్స
వమున భక్త్యాగ్రతికు లిట
వేలకొలది గుమిగూడెడి
వారెగదా ! కాని విగ్ర-
హము రక్షించుకొనుటకై
ఎంతమంది ముందు కురికి
నారని ? ఈ భక్తజనుల
లో పాపము, చాలమంది
దీర్ఘముగా నిశ్వసించు,
చిండ్లలోనె కూరుచుండి
యుందురు " మైనమ్ముకంచె
మెత్తనివార మిల మేము
విష్ణుభక్తుల " మని అనుచు.

నిజదేవుని రక్షింపను

శక్తిసమర్థతలు లేని
దింతే మరి ఈ భక్తియు!
ఉపదేశింపగలేదో
ఆ పూర్వపుభక్తవరులు
విష్ణుభక్తులను గురించి:
"మైనముకంటెను మృదువై,
ఛేదింపగ వలసినచో
వజ్రముకంటెను కఠోర"
మని పలుకగలేదో మరి?
ఈమాత్రపు శక్తిలేని
దే మంతటి భక్తియేమి?—
దాంభికమును పిరికితనము
పైకి నటనమాత్ర గాక.

కను డీగతి సర్వస్వము
నాశమయ్యె!. కాని ఆ వి-
నాశముపై ఇపుడు మనమె
ఆశాభవనమ్ము తిరిగి
నిర్మించుట కుద్యమింప

వలదో ? అది మనజీవన
కర్తవ్యము కాదో మరి ?

కొత్తతర మదృష్టవంత ;
మేలనగా, నపూర్వముగ
అందు సంగమించె, నరయ,
గత శతాబ్ది లనుభవమ్ము,
నీ నాటిది విజ్ఞానము ;
నవచైతన్యము నిండెను
మన జీవనపాత్రయందు ;
కలిగె మనకు గొప్పభాగ్య
మది సార్థక మొనరింతము.

మరి కనరే, యీనాటికి
శేషించిన ఈ భవ్యక-
ర్మాకృతులను ; మన పూర్వికు
లెంతెంతటి ఘనకార్యము
లొనరించిరో యని నిత్యము
నివి వక్కాణించుగదా !

నేటికి నా కైలాస మ-
హామందిర మవలోకన
నేయగ నాత్మాభిమాన
ముప్పతిల్లు మనసులోన ;
అట్టిదింత ఏమయినను
నిర్మింపగ, భుజములలో
విస్ఫురణము జాగరించు ;
దాని కళాసౌందర్యమ-
రందపానమున కనులను
నానందాశ్రులు జనించు ;
మనము నంతవారము కా-
గల మను భావన పైకొను ;
తద్గౌరవ భావనలో
జీవదాత్మ విశ్వాసము-
చే నవజీవనమునకును
పునరుత్థానమునకు నా-
శాజ్యోతులు వెల్లువ లగు.

ఇపుడు ప్రచండోష్ణకాల ;

మిందు ధరణిమాత తప్త
మై విదీర్ణమయ్యె ; శుష్క
రూక్షమునై యెల్ల యెడల
జీవనిర్ఝరము లెండి
'పోయె ; దావవహ్ని పెటిలె ;
వడగాలికి పచ్చదనము
వాడి మాడి, చెట్టులెండె ;
ఈగతి గ్రీష్మము తపింప
నేమాయెను ? వర్షాఋతు
వాగమింపదో, త్వరలో ?
కను డిప్రబలోష్ణమందె
మహాసాగరముల తప్త
మొనరించెడి విరాట్‌శక్తి
నిండియుండు ; నరయ నీటి
యావిరితో నభోమండ-
లమ్ము నిండి, ఝంఝూనిల
మది వీచగ, మేఘావళి
గంధవాహవాహనమై,
మెరపుతీవ నాట్యముతో,

ఘనగభీరగర్జలతో,
క్రుమ్మరించు జీవనవ-
ర్షమ్ములు ; పునరుజ్జీవన
మగు ; తాపితధరణియందు
నణగియున్న నవబీజము
లందునుండి యంకురములు
వెలికివచ్చు ; వసుధ యెల్ల
విలసించు సమృద్ధితోడ ;
ఇటనే, నవశూరరాష్ట్ర
ముదయించు, నహో, తరితో !

అట్టి శూరవీరరాష్ట్ర
నిర్మాణము చేయుకొరకు
పునరుజ్జీవనరూపపు
పర్జన్యసువృష్టికొరకు
జీవనకామేష్టి యనే
మహాయజ్ఞ మారంభము
గావింపుడు ; బుద్ధివాద
మనెడి హోమకుండమందు

అధోగతికి కారణమో
క్షుద్రభేదభావమ్ములా
నాశంకరతత్త్వమ్ములా
'అగ్నయ ఇదం, న మమ' యనుచు
చేయు 'డగ్నయే స్వాహా'

భగవంతుండగు వామన
విగ్రహ మవతార రహ-
స్యము నేమని యనునో కనుడు
'నేడు వామనుడవె యౌదు
గాక, వెంపు కుంఠితమై
నలుగడలను నొక్కుడువడి
అణగారిన ఆకృతివే
యౌదుగాక ; అయ్యును ధరి-
యింపుమా, మహోత్తివిక్ర-
మాకృతి ; నా కాలబలిని
పదతలమున నణచివేయు'
మనెడి మహాసందేశము
నొసగుచున్నదో యనగా

కాలముతో, ప్రకృతితోడ,
తన్నాశక శక్తులతో
నిత్యమ్మును ప్రతిఘటించు
చినాటికి శిథిలమైన
దేవళమున కెదురుకుండ
నిలచియున్న దదె కనుడీ-
విరిగిన ఆ విగ్రహమును.

అర్పణ

అర్పింపగ నీకిదె తె-
చ్చితిని గడ్డిపూల కొన్ని ;
ఎండిన వివి, అరవిచ్చిన,
వరమూసుక యున్నవియును.
ఊషరభూభాగముపై
పుట్టిన వీ పసికూనలు,
శిథిలమైన దేవాలయ
కుడ్యమ్ముల నెరియలలో,
క్రిక్కిరిసిన అరుగులలో,
ఊడుచున్న రాలలోన
ఎట్లో వికసించిన వివి ;
నే నెటు లర్పించితినో
ఉండనిమ్ము వానినటులె.

అల్లిన యీ శబ్దజాల
మయిపోయిన దిదె, కనుమా
పోగులా, సమాప్తమయ్యె ;
శబ్దములా, సాంతమయ్యె ;
భావనాప్రపూరమ్మో,
తగ్గె ; తిరిగి మనసులోన
జడస్థిరత ఆవహిల్లె ;
కార్యపూర్తి నౌదాసీ-
న్య మ్మేదో వచ్చిపడియె ;
గానమైన తదుపరి గా-
యకుని హృదయకుహరములో
అస్ఫుటముగ నిస్వనించు
స్వరమువోలె ; చిత్రలేఖ
నాంతమందు, చిత్రకారు
నకు 'నాజూకైన చిత్ర
మయ్యు, నిచట రంగు సరిగ
పడలే, దిట సూక్ష్మభావ
మేర్పడలే, దని మనసున
ననిపించెడి విధముగాగ.

నెరవేరక హృదయాళయ
మది రిక్తముకాగా, ఈ
యౌదాసీన్యము కలిగెనో !

వట్టికాగితముపై చి-
త్రము కల్పించుకొను చిత్ర
కారునివలె, సూక్ష్మశ్రుతి-
లో గీతీవిస్తారము
విను గాయకవరునివలెను,
రాతిలోన దాగియున్న
విగ్రహమును దరిసించెడి
శిల్పివోలె, కళకు బూని
రేఖలతో, రంగులతో
చిత్రమ్ము నిబంధింపగ,
స్పందించిన శ్రుతిగీతము
కంఠాగత మొనరింపగ,
పాషాణమునుండి విగ్ర-
హమును బయల్పరుపంగను,
తమకార్యము పూర్తికాగ

నెర వేరని తమ నేరుపు
గురిచి తలచి, ఉపకరణ
స్థూలగుణము నెంచి, తాము
మొదట నాసపడినయట్టి
కళాకార మెదకు తోప
నుద్విగ్నత చెందుదురే!
కుంచె ఇచట ఎక్కువపడె
రంగుల సమ్మిశ్రణ మిట
సరిగలేదె యనుకొనుచును;
ఆ స్వరమట సంవదింప
లేదని తలపోయుచును;
రాతి పెచ్చు ఒకింతిచట
అధికముగా తెగినదంచు;
చిత్రకారుడును, గాయక
వరుడు, శిల్పి చింతింతురు.
అట్టి చింతనమె నేయుచు
ఈక్షణమున నేను నుదా-
సీనత వహియించుచుంటి.
మనసులోన భావించిన

కావ్యాశయ మంతయు నా
శబ్దచిత్రమున ద్యోతక
మయినట్టులులేదే, మన
మందే ఎదో మిగిలిపోయె;
అదిఎదో ఊహింపలేను,
శబ్దానికి అది అందదు.
కానీ నా నేరుపునకు
ఇంతకంటె ముందడుగిడ
శక్తిచాలదని తలచుచు,
ఇది నాహృద్దనుచు ఇటులె
కావ్యము నిట విడచివైతు,
సంపూర్ణమ్మని తలచుచు.

ఇంక తృప్తిచెందని నా
మనసుతో నపూర్ణమైన
దీనిని మీ కర్పింతును.

అనుబంధం 1

టిప్పణి

కవిపరిచయము : ఆత్మారామ్ రావ్‌జీ దేశపాండే - జననం 1901. 'ఫుల్‌వాత్' అనే పేరితోటి కవితాసంగ్రహము 1902 లో వెలువడింది. అంతకుముందు 'అనిల్' అనే ఉపనామంతో ఈయన వ్రాస్తూవచ్చిన కవితలు ప్రకాశిత మవుతూ ఉండేవి.

రచనాకాలము : 'భగ్నమూర్తి' (విరిగిన విగ్రహం) అనే ఈ ప్రస్తుత కావ్యం 7-5-1935 న నాగపూరులో ప్రారంభించినది 20-6-1935 న 'రామటేక్' లో పూర్తి అయింది.

పుట 1 పంక్తి 1, 3 విరిగిన విగ్రహము - శిథిలమైన దేవళము :

నాగపూరునకు ఈశాన్యదిక్కుగా 24 మైళ్ల దూరంలోఉన్న 'రామటేక్' అనే ప్రసిద్ధపుణ్యక్షేత్రంలో త్రివిక్రమవామనుని విగ్రహం ఉంది. "కాశీయాత్రామహాద్వార" మనే ప్రసిద్ధి ఈ 'రామటేక్' నకు పూర్వకాలంనుంచీ ఉంది. కాళిదాసు మేఘసందేశంలో ఉటంకించిన రామగిరి, ఈ రామటేకే అని ప్రాచ్య

విద్వాంసుల మతము (చూ. ఆచార్య వాసుదేవవిష్ణు మిరాశీ కృతమైన "కాళిదాసు"-పుటలు 39, 120, 121). రామలక్ష్మణుల ప్రాచీనదేవాలయాలున్న కోటకొండమీదనే, వరాహద్వారానికి ఈశాన్యదిక్కున ఉన్న దిబ్బమీద ఈ విరిగిన విగ్రహమూ, దాని శిథిల దేవాలయమూ ఉన్నాయి. విగ్రహం ఎర్రరాతిది. దాని ఎత్తు 5 అ. 9 అం.; వెడల్పు 4 అ. 4 అం. ఈ విగ్రహమును గూర్చిన జనప్రసంగము వింటే, జనులు నిజసంస్కృతిని ఎంతగా మరచి పోయారో ఊహించుకోవచ్చు. రామటేకులోని ప్రజలే ఈ పాడువడ్డ దేవాలయాన్ని 'అన్నా - చెల్లి గుడి' అంటారు. వామనుని విగ్రహాన్ని అన్నగానూ, బలివిగ్రహాన్ని చెల్లెలిగానూ భావిస్తున్నారు. వానినీళ్లకు ఈ వామనమూర్తి విగ్రహంమీద అక్కడక్కడ మచ్చ లేర్పడ్డాయి. దీనికి అక్కడివాళ్లు, చెల్లెలిని కాలితో తన్ననందుకు అన్న శరీరంమీద పొడలుపుట్టినాయని కథ కల్పించారు. అక్కడి వాళ్ల బుద్ధికి ఈ విగ్రహంలో ఈ దృశ్యమే గోచరించింది కాబోలు!

ప్రాచ్యవిద్వాంసులయిన డా. హీరాలాల్ ఈ విగ్రహం వామనునిదనీ, అతిపురాతనమైనదనీ చెప్పారు (చూ. నాగపూర్ జిల్లా గెజెటియర్ 1908, పుట 333). విగ్రహం నిజంగా వామనునిదే. వామన విగ్రహకల్పన ఈ విగ్రహకాలంకంటె ఎంతో పూర్వపదని కూడా తోస్తుంది. మన దేశంలో ఉన్న ఇతరవామనవిగ్రహ ములతో పోల్చిచూస్తే, (ఉదా. వేరూర్‌లో ఒకటి ఉంది), ఈ

విగ్రహం ఎంతో కళాపూర్ణంగానూ, అందంగానూ ఉన్నట్టు అగుపిస్తుంది.

ఈ విగ్రహానికి ఎదురుగా ఇప్పుడున్న శిథిలదేవాలయం ఎంతో చిన్నదిగా ఉంటుంది; కానీ చుట్టుపక్కల ఉన్న శిథిలాలు చూస్తే పూర్వము పెద్దదనే తోస్తుంది. ప్రస్తుతం ఈ గుడికి ఆరు స్తంభాలున్నాయి. విరిగిన యీ విగ్రహమునూ, దాని తాలూకు గుడినీ ప్రాచీననిర్మాణసంరక్షణకు సంబంధించిన నియమములప్రకారం కాపాడుతున్నారు. పురాతత్త్వశాఖవారి నోటీసుకూడా అక్కడ ఉంది. కాని అంతమాత్రంతో అల్లరిమూకలుచేసే ఆగడం పూర్తిగా అణగలేదు.

పుట 3 పంక్తులు 14, 15 కళావిధ్వంసులు - నృశంసులు:

సమానార్థకమయిన ఆంగ్లశబ్దము 'వేండల్స్' (Vandals).

పుట 3 పంక్తి 18 ఎర్రరాతి చూర్ణము:

విగ్రహం ఎర్ర రాతిని దొంగతనంగా ముక్కలుగా కొట్టుకు పోతూ ఉంటారని తెలిసినవాళ్లు చెప్పారు.

పుట 4 పంక్తి 15 కమలబంధము:

సమానార్థక ఇంగ్లీషు పదము 'లోటస్ మోటిఫ్' (lotus motif). భారతీయ శిల్పశాస్త్రంలో ఇదే అర్థంలో 'పద్మబంధము', 'పంకజబంధము', 'కమలబంధము' అనేరూఢి శబ్దాలు లభిస్తాయి. 'మోటిఫ్' అనగా, కళాఖండమందలి ప్రధానాశయమునుగాని, ముఖ్యకల్పనమునుగాని విశదపరచు భాగవిశేషము.

పుట 7 పంక్తి 15—అంబాలయము :

ఇది 'రామటేక్' కొండకు తూర్పువైపున క్రిందుగా ఉన్న చెరువు పేరు. వనవాసకాలంలో సీత ఈ జలములలో స్నానము చేసేదని జనశ్రుతి. (యత్తత్ర్పకే జనకతనయాస్నానపుణ్యోదకేషు —కాళిదాసుని మేఘదూతము). ఈ నీటిలో స్నానము చేసినందు వల్ల అంబరాజునకు కుష్టరోగము పోయిందనీ, అందుచేత ఆ రాజు ఈ జలాశయమును కట్టించినాడనీ అంటారు. ఆ కారణంగా దీనికి 'అంబాలయ' (అంబాళే) అని పేరు వచ్చిందట. (చూ. నాగపూర్ జిల్లా గెజెటియర్ 1908, పుట 333) నాగపూర్, వర్హాడ్ ప్రాంతముల నుండి మరణించిన వారి అస్థికలను ఈ చెరువులో కలపడానికి తీసుకు వస్తూ ఉంటారు.

పుట 10—పంక్తి 3 రామగిరి :

ఇది 'రామటేక్' నకు పూర్వమున్న పేరు. (చూ. కాళిదాసుని మేఘదూత); వర్హాడ్ ప్రాంతంలో వర్ధిల్లిన 'వాకాటక' రాజ్యమునాటి తామ్రశాసనంలో, ప్రభావతీ గుప్తాదేవి వ్రాయించి నది, 'రామగిరిస్వామినః పాదమూలాత్' అని (చూ. భారత ఇతిహాస సంశోధక మండలమువారి త్రైమాసిక పత్రిక —సం॥ 3, 2-3-4 సంచికల ప్రతి—పుట 39).

పుట 10 పంక్తి 10—సిందురగిరి పరిసరములు :

'రామటేక్' నకే మరొక పేరు, రామటేకులో ఉన్న లక్ష్మణుని గుడిలో యాదవరాజయిన రామదేవరాయని కాలపు

శిలాశాసనము ప్రకారము (చూ. ఆచార్య మిరాశీకులకర్ణిల సంపాదకత్వమున వెలువడిన సర్దేశాయి స్మారక గ్రంథము, పుట 115).

పుట 10 పంక్తి 12—వాకాటక రాజ్యము :

వాకాటక రాజవంశము విదర్భలోనూ, తత్పరిసర ప్రదేశములోనూ సుమారు క్రీ. శ. 200 మొదలు 500 వరకు అత్యంత వైభవంతో వెలుగొందింది. ఈ వంశము వారి శిలా, తామ్రశాసనములు లభించినాయి (చూ. జాయస్వాల్ రచియించిన 'హిష్టరీ ఆఫ్ ఇండియా' పుట 150 మొ॥ 350; ఆచార్య మిరాశీకృత 'కాళిదాసు').

పుట 11 పంక్తి 15—రామలక్ష్మణుల కోవెల :

'రామటేక్' కొండమీది ప్రాచీనమూ ప్రధానమూ అయిన దేవాలయము.

పుట 11 పంక్తి 17, 18—భోంసలేమహలు, బారాద్వారము :

దేవాలయబహిఃప్రాకారములోని కట్టడములు. బారాద్వారాన్ని 'రామఝరోకా' (రాములవారి కిటికీ) అని అంటారు. అక్కడినుంచి చూస్తే నలుప్రక్కలా ఎంతో అందమయిన దృశ్యాలు గోచరిస్తాయి.

పుట 18 పంక్తి 18—నవతాల సుపూర్ణాకృతి :

పొడుగు వెడల్పుగల విశాల పరిమాణమునకు శిల్పశాస్త్రంలో 'తాల' మని పేరు. 12 అంగుళములు ఒక 'తాలము'. నరవిగ్ర

హము 10 తాలములు, క్రూరమూర్తి 12 తాలములు, అసురమూర్తి 16, బలిమూర్తి 12, కుమారమూర్తి 8 తాలములు ఉండవలెను. అట్లే కృతయుగమున 10 తాలములు, త్రేతాయుగమున 9, ద్వాపరములో 8, కలియుగములో 7 తాలములు ఉండవలెనని శిల్పశాస్త్ర విధానము. కాని శిల్పులు సాధారణంగా 9 తాలముల విగ్రహము నిర్మిస్తారు. (చూ. శుక్రనీతి, ముల్కరాజ్ ఆనంద్ రచితమయిన 'హిందూ వ్యూ ఆఫ్ ఆర్ట్'—(Hindu View of Art); అవనీంద్ర టాగూరు 'సమ్ నోట్స్ ఆన్ ఇండియన్ ఆర్టిస్టిక్ అనాటొమి'—Some Notes on Indian Artistic Anatomy).

పుట 14 పంక్తి 8—భంగిమ:

హైందవ శిల్పశాస్త్రంలో విగ్రహముల భంగిమములను గూర్చి నాలుగు పద్ధతులు చెప్పి ఉన్నాయి.

(i) సమభంగము: అన్ని పక్కలను సమానమయిన తూకము ఉండవలెను. ఉదా॥ సాత్త్వికధ్యానస్థ విగ్రహములు.

(ii) అభంగము: ఒక పాదము మీద కొంచెము భారము మోపి ధ్యానముద్రలో నిలబడి ఉండవలెను. ఉదా॥ ధ్యానస్థ విగ్రహములు.

(iii) అతిభంగము: పెనుగాలికి వృక్షము వంగినట్లు, భావనా భారముచే బాగా వంగి నిలబడి ఉండవలెను. ఉదా॥ ప్రహారము సంహారము, ఈ మొదలగు కార్యములందలి విగ్రహములు.

(iv) త్రిభంగము : అతిభంగములోనే మరొక రకము. మూడు స్థానములలో వంపులున్న విగ్రహము—(చూ. పైన చెప్పినవే).

పుట 14 పంక్తి 11, 12—పెందొడలను జీరాడెడు ఉత్తరీయము(ఉరుమాల):

రెండు దండలకును కట్టి (చుట్టి) తొడలవరకును వ్రేలాడునట్టి మాల (మాలాకారపు టుత్తరీయము).

పుట 15 పంక్తి 5, 6—దానశూర....బలిరాజు.

" యేన బద్ధో బలీ రాజా
దానశూరో మహాబలీ "

—రక్షాబంధనమంత్రము

పుట 15 పంక్తి 16—ప్రభామండలము :

విగ్రహముయొక్క ముఖముచుట్టునుగల కిరణపుంజమును దెల్పు తేజశ్చక్రము.

పుటి 16 పంక్తి 7—అద్భుతవామన :

జయదేవకవి గీతగోవిందములో వామనావతారవర్ణన మీ కింది విధంగా చేసినాడు :

" ఛలయసి విక్రమణే బలిమద్భుతవామన,
పదనఖనీరజనితజనపావన,
కేశవ, ధృతవామనరూప,
జయ జగదీశ, హరే".

పుట 16 పంక్తి 11, 12—రేఖా సంగతి :

సమానార్థకమయిన ఆంగ్లపదము 'హార్మొనీ ఆఫ్ లైన్స్' (Harmony of lines).

పుట 18 పంక్తి 18—అనాహతనాదము :

తాకిడి లేకుండా ఉత్పన్నమగు ధ్వని.

పుట 24 పంక్తి 3—మథురలోని పురావస్తు సంగ్రహాలయము :

కర్జన్ మ్యూజియం ఆఫ్ ఆర్కియాలజీ.

పుట 27 పంక్తి 16—కాళిదాసు :

మహాకవి కాళిదాసు ఈ రామటేకునకు వచ్చెనట. దీనిని గూర్చి ఆచార్య మిరాశీకృత 'కాళిదాసు' చూడుడు.

పుట 28 పంక్తి 14—మేఘుని కర్తవ్యము :

'స ప్రత్యగ్రైః కుటజకుసుమైః
కల్పితార్ఘాయ తస్మై'

—(మేఘదూత 4వ శ్లో.)

పుట 29 పంక్తి 12, 13—వైభవమిచటి రామగిరిని :

(చూ. ఆచార్యమిరాశీకృత 'కాళిదాసు'—పుట 9).

పుట 29 పంక్తి 15—రెండవ ప్రవరసేనుడు :

వాకాటకవంశపురాజు, చంద్రగుప్త విక్రమాదిత్యుని దౌహిత్రుడు.

పుట 29 పంక్తి 16, 17 ప్రభావతీగుప్తాదేవి :

చంద్రగుప్త విక్రమాదిత్యుని కూతురు. ఈమెకును వాకాటక వంశీయుడయిన ద్వితీయ రుద్రసేనునికిని (సుమారు క్రీ. శ. 380 లో) వివాహము జరిగినది. రుద్రసేనుని మరణానంతరము, కుమారుడు ద్వితీయప్రవరసేనుడు చిన్నవాడు కావడంచేత, ఈమెయే రాజ్య వ్యవహారములను చూచుచుండెడిది.

పుట 30 పంక్తి 1—రామగిరిస్వామి :

ప్రభావతీగుప్తాదేవి రాజ్యసమృద్ధిని గూర్చి తామ్రశాసనములలో ఉల్లేఖింపబడినది: "రామగిరిస్వామినః పాదమూలాత్" (భారత ఇతిహాస పరిశోధక మండలము వారి త్రైమాసికపత్రిక సం॥ 3—2-3-4 సంచికలు గల ప్రతి-పుట - 93). ఈ తామ్రశాసనము కార్తికశుక్ల ద్వాదశినాడు రామగిరిపై శ్రీరామచంద్రపాదార విందములకడ, ఒక బ్రాహ్మణునికి సమర్పింపబడినది.

పుట 30 పంక్తి 9—నందపురము :

'రామటేక్' తాలూకాలో అడవిలో 'పేంచ' నదీతీరమున నుండిన ఒక పట్టణము. ఇచటి అవశేషములను గూర్చియు, ఈ నంద పురమే వాకాటకరాజధానియై యుండుననుదానిని గూర్చియు 'జర్నల్ అండ్ ప్రొసీడింగ్స్ ఆఫ్ ది ఏషియాటిక్ సొసయిటీ ఆఫ్ బెంగాల్, న్యూ సీరిజ్—29-1933 నం. 1 లో ఆర్. టి. ఏ. వెల్స్టెడ్ రచించిన 'నోట్స్ ఆన్ వాకాటకాజ్ ఆఫ్ ది సి. పి. అండ్ బరార్

అండ్ దెయిర్ కంట్రీ; ఫోర్త్ టు సిక్స్‌త్ సెంచరీ ఏ. డి.' అను వ్యాసమును చూడుడు.

పుట 31 పంక్తి 5—అభేద్యదుర్గములు:

నందపురమునకు ఇరుప్రక్కలను భీవగడము, ఘుఘుసగడము అను పేర్లతో రెండు పర్వత దుర్గములు కలపు.

పుట 33 పంక్తి 7—తత్త్వము:

ఈ శబ్దము ప్రత్యేకమయిన శాస్త్రీయార్థములోగాక, వ్యాపకమూ వ్యావహారికమూ అయిన అర్థములో, ముందొకసాలీ, ఇప్పుడునూ వాడబడినది.

పుట 33 పంక్తి 12—ఆత్మరక్షణ:

దీనికి సమానార్థకమయిన ఆంగ్లపదము 'సెల్ఫ్ ప్రిజర్వేషన్'

పుట 34 పంక్తి 7—భీమసరట మొ॥

ఆంగ్లమున సమానార్థక పదములు.

భీమసరట—డాయనాసార్ (Dinoceras)

బిధురసరట *(భిదిరసరట)—బ్రాంటోసోరస్ (Brontothere)

వర్ధజాహుసరట (జలసరట)—ప్లేజియో సోరస్ (Plesio Saurus)

మీనసరట—ఇక్థియోసోరస్ (Ichthyo Saurus)

మత్తదంత (మహామద)—మేస్టొడోన్ (Mastodon)

---

* బ్రాకెట్లలో ఇచ్చిన పేర్లు ఇంకాసరిౖనవి.

మమ్మథము (శంకుదంత)—మేమెథ్ (Mammoth)

లక్షలాది సంవత్సరములకు పూర్వము ఈ ప్రచండజంతువులు భూతలమున వర్ధిల్లినవి. నేటి కాలములో శిలీభూతమయిన వీని అస్థిపంజరములు దొరికినాయి.

పుట 35 పంక్తి 15, 16—జీవద్రవము :

ఆంగ్లమున 'ప్రోటోప్లాజం' (ఆజరేకర్ కృత 'వనస్పతిజీవన' మనే గ్రంథంలో వాడిన పారిభాషిక పదము.)

పుట 63 పంక్తి 18—వేలకొలది యాత్రికులు :

'రామటేక్' వద్ద జరుగు త్రిపురీపూర్ణిమకు చాలా పెద్ద ఉత్సవం జరుగుతుంది.

పుట 65 పంక్తి 12—త్రిపురదహన :

త్రిపురీపూర్ణిమకు రామటేక్ వద్ద అర్ధరాత్రమున ఆరతివేళకు త్రిపురదహనం జరుగుతుంది. పసుపుపచ్చని బట్టను నేతిలో తడిపి, అన్నిటికంటె ఎత్తయిన దేవాలయకలశం దగ్గర, ఏర్పాటుచేసి పెట్టినచోట, పెద్ద హారతిపళ్లెంలో ఆ వస్త్రమునుపెట్టి ఆరతివేళకు దాన్ని వెలిగిస్తారు. దీనినే 'త్రిపుర'మనీ, జనభాషలో 'టిపూర్' అనీ అంటారు.

పుట 69 పంక్తి 1—కైలాస :

వేరూళ్‌నందలి కైలాస దేవాలయము.

అనుబంధం 2

కావ్యమునుగూర్చిన కొన్ని మాటలు

(మూల గ్రంథకర్తను అనుసరించి)

*అనువాదము :—

ఈ అనువాదానికి మూలమయిన 'భగ్నమూర్తి' అనే మరాఠీ కావ్యంలో కవి ముక్తచ్ఛందస్సును అవలంబించినాడు. అది మాత్రాత్మకమూలకము : లయ, ఊత, ప్రధానము. అవి తెలిసి పఠిస్తే కావ్యం శ్రోత్రపేయంగా ఉంటుంది. అనువాదంకూడా అట్లాగే, యతిప్రాసలు పాటించకుండా, మూలానికి సాధ్యమయినంత దగ్గరగా తీసుకురావడం జరిగింది. ప్రతివంక్తినీ మధ్యలో విరిచి, ఊనికతో పఠింపవలెనని మనవి. ఉదా :—గతవైభవ। సాతులుగా.

సమప్తపదములో, క్రావడితో కూడిన అక్షరానికి పూర్వమందలిది గురువుగానో, లఘువుగానో, లయకుతగ్గట్టుగా పఠించుకోవచ్చు.

---

* (ఇది అనువాదకునిది)

ఉదాహరణములు :

(i) కాని అతని ముఖముద్రను (గురువు) [పుట 15]
(పదమధ్యమందు క్రావడితో గూడినది కనుక.)

(ii) మూలము సంస్కృతి క్రోసమై గద (లఘువు, సమస్త పదంలో నయినను) [పుట 29]

(iii) నఖశిఖపర్యంత మోత్త। క్రోతమయిన ప్రూర్ణాకృతి (లఘువు) [పుట 18]

(iv) ఓజోవద్వీరరస క్ర।ధానమహా కావ్యమ్మది (లఘువు) [పుట 13]

ముక్తచ్ఛందమంటే ఏమిటి?

ఏ ఛందస్సునకయినాసరే, తాళబద్ధత (ఆంగ్లములో 'రిదమ్') అనేది మూలలక్షణము. (ఈ 'తాళము' సంగీత శాస్త్రములోని 'తాళము' గా భావింపరాదు.) ఈ లక్షణము నెవ్వరూ కాదనరు. ముక్తచ్ఛందస్సునకు లయప్రధానం కాదనుకోవడం అజ్ఞానం. 'తాళ ప్రాధాన్యము' అనే ఈ చట్రములోనే ఛందస్సును ముక్తము చేయడమే ముక్తచ్ఛందస్సు ఉద్దేశ్యము. ప్రతి నవకనితా యుగారంభంలోనూ, ఒక కొన్ని నవీనచ్ఛందస్సులు ప్రచారంలోకి వస్తాయి. యతిప్రాసమైత్రిగాని—ఇది తెలుగు ఛందోలక్షణం—అంత్యానుప్రాసాదులుగాని ఉండవలెనను నియమములు పెట్టుకోనిదే ముక్తచ్ఛందస్సు. అసలు కావ్యానికి ఛందస్సు అవసరమా అనే ప్రశ్నకు సమాధానంగా, భావభావనాస్ఫూర్తికి అనుగుణంగా స్వాభావికంగానే తాళబద్ధమయిన శబ్దరచన వస్తుంది అనే విష

యము గమనించదగ్గది. గద్యంలో, కూడా కావ్యమయమయిన భాగం ఏదో లయాన్వితంగానే నడుస్తుందిగదా!

కావ్యంలో నవయుగం ఎట్లా వస్తుంది?

కావ్యవస్తువులోనూ, కావ్యరచనలోనూ వచ్చే మార్పులు, కవిపరిసరములు, మనస్సు, కల్పనలు అనే వానిలోని మార్పులకు అనుగుణంగా వస్తాయి. వానితోబాటే శబ్దప్రయోగాలలోనూ మార్పు వస్తుంది.

ఆధునిక కావ్యం:

పూర్వకాలంలో వాఙ్మయంలో పద్యకావ్యానికి ఏమిస్థాన ముందని చూస్తే, పద్యరచనయే. వాఙ్మయసర్వస్వంగా భావింప బడేది మొదట్లో. క్రమంగా గద్యం కూడా తలదూర్చి వాఙ్మయంలో చోటు చేసుకొంది. చిన్నకథలూ వ్యాసాలూకూడా పద్యకావ్యంతో బాటు సాహితీపీఠ మెక్కుతున్నాయి.

గద్యంలో చెప్పడానికి శక్యంకానిదే పద్యమనే నిర్వచనం పరిశీలిద్దాము. అసలు, గద్యంలో ప్రకటించడానికి వీలులేని విషయమే ఉండదే! ఆయితే మరి ఛందోబద్ధమయిన కావ్యం అవసరమే లేదా అంటే, మహారాష్ట్ర భావగీతముల ద్వారా

అధునిక తెలుగు సాహిత్యంలో కూడా ఈ పదము చాలకాలం వాడుకలో ఉండి, ఇవ్వుడు అంతగా వాడుకలేకున్నది. ఇది మహారాష్ట్ర సంపర్కంవల్లె తెలుగు లోకి వచ్చినది. మహారాష్ట్రసాహిత్యంలో ఏనాటినుండో దీనికి స్థానం; ఇప్పటికీని.

వెల్లడించే భావాలు గద్యంలో ఎప్పుడూ చెప్పలేము. సాహిత్యం అనేది ఉన్నంతకాలం భావగీతాలు ఉండవలసిందే ఉంటాయి. భావగీతాలు ఉన్నంతకాలం సాహిత్యం ఉంటుంది. అంటే భావగీతాలే పద్యకావ్యానికి మూలప్రకృతి అన్నమాట. ఉత్కట మయిన భావనలు లయాన్వితంగా, సహజంగా బహిర్గతమ కావడమే భావగీతం.

కాని కేవలం భావగీతాలతోనే పద్యకావ్యాలు పూర్ణవికా సాన్ని పొందలేవు. భావగీత విస్తరణమే దీర్ఘకావ్యం. కేవల కథ నాత్మకకావ్యాలకు పద్యకావ్యవాఙ్మయంలో స్థానంలేదు. ఒక కథను ఆధారంగా చేసికొని అక్కడక్కడ వేర్వేరు భావగీతాలు కూర్చితే, అది భావగీతవిస్తార మనిపించుకోదు. బీజంలోనే వృక్ష మంతా ఇమిడి ఉండాలి గదా! కాండము, కొమ్మలు మొదలయిన కొయ్యలు తెచ్చి వృక్షమును సృష్టించలేము గదా! అట్లాచేస్తే అది జీవద్వృక్ష మవుతుందా?

భావనాంకురములోనుండి పుట్టిన ప్రకృత్యాది తత్త్వజ్ఞాన విచారమును కావ్యప్రవణముగా చేయడము వలన ఆధునిక పద్య కావ్యములో ఒక పరిణామమును తీసికొని రావడం జరుగుతుంది.

---

a4

పుట	ఉన్నది	ఉండవలసినది
34	మన్మథ	మమ్మథ
47	వినాశమ్మని	నాశమ్మని
48	నంచయ	సంచయ
61	వైక్య	నైక్య
64	మాకారము	మాకాశము

LIBB101B190

BC

ఆ. రా. దేశపాండే "అనిల్"

శ్రీ ఆత్మారామ్ రావ్‌జీ దేశపాండే (ఉపనామము "అనిల్") మరాఠీ భాషలో యుగప్రవర్తక కవులలో ఒకరుగా భావించబడుతున్నారు. ఆయన ఆధునిక మరాఠీ కవిత్వంలో నవయుగ నిర్మాత. 1925 వ సం॥లో మరాఠీ (కవిత)లో "ముక్తచ్ఛందము"ను వాడి ఒక (నవీన) ప్రయోగము చేశారు. ఆయన కవియే కాకుండా కావ్య విమర్శకులు కూడ. మరాఠీ కావ్యసమీక్షలో "ప్రక్షోభ" రసమును ప్రవేశ పెట్టారు.

ఆయన 1902 వ సం॥లో విదర్భలోని మూర్తిజాపురంలో జన్మించారు. బి. ఏ., ఎల్. ఎల్. బి. వరకూ పూనా, నాగ పూరు పట్టణాలలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. ప్రస్తుతం ఆయన కేంద్ర విద్యామంత్రిత్వ శాఖలో జాతీయ సాంఘిక విద్యాకేంద్ర సంచాలకులుగా ఉన్నారు. 1925 వ సం॥లో మహారాష్ట్ర సాహిత్య సమ్మేళనమునకు అధ్యక్షులుగా ఎన్నిక అయినారు.

సాహిత్యక్షేత్రంలో ఆయన ప్రవేశం 1932 లో ప్రకటిత మయిన "ఫుల్‌వాత్" (పూజాదీపం) అనే కవితా సంపుటితో ప్రారంభమయింది. తరువాత "భగ్నమూర్తి" (విరిగిన విగ్రహం) రచన 1935 మే 8 వ తేదీన నాగ పూరులో ప్రారంభమయి, 1935 జూన్ 20 వ తేదీన రామ్‌టేకులో పూర్తిఅయింది. "అనిల్" గారి మరొక రెండు ప్రసిద్ధమయిన కావ్యగ్రంథాలున్నాయి, "నిర్వా సిత చైనా బాలునికి" (1942 వ సం॥); పేర్తేహ్వో— ఒకానొక పక్షి పేరు—(1947 వ సం॥).

మువసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావహ్నిక

పుస్తకం సంఖ్య	LIBB101B190
పుస్తకం పేరు	వింగేవ విగ్రహం
తారీఖు	26 August 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	105
పెద్ద సైజు పేజీలు	NIL
ఖాళీ పేజీలు	NIL
లేవి పేజీలు	NIL
తయారు చేసినది	K. Anilesh
పేజీలు విడదీసినది	Anilesh
స్కాన్ చేసినది	Vyshnavi
పరీక్ష చేసినది	sharmila
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good